# 9

## ఉషారాణీతో ఇంటర్‌వ్యూ

ఆరేళ్ళ నించి నాకీఆశ - నాపేరుతో పత్రికల్లో ఓ వ్యాసమో, కథో, చివరికి ఒక సన్నని గీతమో పడాలని. సంపాదకులకి పంపిన ప్రతిసారీకూడా, ఆ కాయితాలు నాకు మళ్ళీ కనబడకుండా, విశ్వసారస్వతార్ణవంలో కలిసిపోవడమే తటస్థించింది. సుప్రసిద్ధ రచయితలచేత నా చిత్తులు సాపుదిద్దించుకున్నా లాభం లేకపోయింది. వాళ్ల చేత సిఫార్సు ఉత్తరాలు వ్రాయించుకున్నా అంతే అయింది. ఒక నవ్యసారస్వత పితామహా శాస్త్రుల్లకి మూణ్ణెల్లు కాఫీ లిప్పించినా.. దేవతలు నామీద కటాక్షించలేదు.

మొన్న 'తెలుగు సినిమా' పత్రిక చూసేటప్పటికి ఎండి చచ్చిన నా ఆశాలత అమోఘంగా చిగిర్చింది. ఒక్క సినిమా తారని ఇంటర్‌వ్యూ చేశాను, నా మొహాన యిన్నాళ్లూ మూతపడ్డ పత్రికా కవాటాలన్నీ మంత్రించినట్లు తెరుస్తాయి, ఆ తార నామాక్షరాలు. ఆరేళ్లనించి ఈ ఘనాఘన కవిపరేణ్యులు

చెయ్యలేని పని, ఒక్క సినిమాతార అవలీలగా చేస్తుంది.

మావూళ్ళో ఒక్క తారా లేదు-తారాబాయి వుందిగాని, ఆమె ఇంటర్వ్యూలో ఉపయోగించే భాషని చలంగారుకూడా అచ్చులోకి ఎక్కించలేరు. తప్పదు. మద్రాస్ పోవాలి. ఆమాత్రం డబ్బు వుంటే నేనీపాటికి ఓ తెలుగు పత్రికనే పెట్టివుందును. లేక పోతే ఓ Studio నిర్మాణం చేసివుందును.

నేను రైలుచార్జీ సంపాయించిన పద్ధతి తెలి పితే, యువకులకి దుష్టమార్గాలు బోధిస్తున్నానని, సోక్రటీస్‌కి మల్లే నాకూ విషమిస్తారు. నాజీవితాద ర్శాన్ని సఫలీకృతం చేసుకోబొయ్యే యీ నిమిషాన నాపేరు పత్రికల్లో పడబోతున్న సమయాన, నా జీవిత సూర్యుడు అపరాంబుధిని తేజోరహితంగా గ్రుంకడం తలపులోనన్నా సహించలేను.

కనుక-మద్రాసుచేరాను. సెంట్రల్ స్టేషన్‌లో దిగడంతోటే, ఒక లావాటి ఆయన—

'హల్లో, కమాన్!' అని నన్ను తీసుకుపోయి, బస్సు యెక్కించి, రెండూ టిక్కెట్లు కొనిపించి, నాతో కూడా హోటల్లో స్థిరపడ్డాడు. నేను పట్నం వచ్చిన పని ఆయనతో చెప్పాను. ఆయన్ని మొదట నేనెరక్క పోయినా, తరవాత ఆయనెవరో తెలిసింది. నేనెవరో ఆయనకి మొదటినుంచీ తెలిసినట్టుంది. అంత సుప్రసిద్ధ ఆంధ్రుడి పరిచయం అంత చవకగా అయినందుకు నన్ను నేను చాలా అభినందించుకున్నాను.

‘‘సరైన మనిషి దగ్గరకొచ్చారు. నేనిప్పుడే నాలుగు వేల రూపాయలకి నా పుస్తకం సినిమా రైట్లు కొన్నాను. రేపు పొద్దున్నే Taxi లో వెళదాం. ఏయే తారలు కావాలో లిస్టు యివ్వండి.’’ అన్నారు ఆయన.

ఆ రాత్రి సంతోషంతో నాకు నిద్రపట్టలేదు.

సృష్టి నాకిచ్చిన సౌందర్యానికీ, రీతికీ నాగరికత యివ్వగల సహాయాన్నంతా సేకరించుకొని, ఆయనతో బైలుదేరాను. నా దగ్గిర Visiting Cards లేవు. నేనొక సారి కొట్టాలనుకొని, దీర్ఘాలోచనపైన ఆపుచేసిన వారపత్రికలకు Letterheads వుంటే అవి కత్తిరించి, రెండు పుంజీలు జేబులో వేసుకున్నాను.

ముందు ‘క--’ దగ్గరికి వెళ్లాము. గుర్రమెక్కిన చెప్పులతో పడుకుని ఆమె లేవటం లేదుట.

‘కా__’ యింటికి వెళ్ళాము - ఆమె ‘‘నాకు తెలిసిందంతా యిదివరకే చెప్పేశాను- ఎంత వెదికినా ఒక కొత్తసంగతీ లేదు’’ అంది.

‘ప__’ ‘‘నేనేమీ తారను కాదు, దారితప్పి వొచ్చా’’రని స్పష్టంగా చెప్పింది,

కృ— దగ్గరికి వెడితే ఆమెకి depression వొచ్చిందిట.

కొ__ఖాళీగావుంది.

‘‘సినిమాలో సంగీతం శాస్త్రీయంగా వుండాలంటే, ఏం చెయ్యాలని మీ అభిప్రాయం?’’ అని

అడిగాను. ఆమె భయపడి, అటూ ఇటూ చూసి, చప్పున లోపలికి వెళ్ళి మళ్ళీ రాలేదు.

పు—మద్రాసులో వుందని వెడితే, ఆమె ఫలహారంచేస్తోంది, తలెత్తి మమ్మల్ని చూడకుండానే, "తెండి" అంది.

"మీ అభిరుచులేమిటి?" అన్నాను.

తనముందు పళ్ళాలు చూపి — "ఇవన్నీ, ఇంకా—"అంటూ వుంటే మేము వొచ్చేశాము.

రం—యింటికి వెడితే, ఆమె, "సినిమానించి విరమిస్తున్నట్లు నిన్న ప్రకటించానే, మీకు తెలీనే లేదా?" అంది.

మేము బైటికి వొచ్చేటప్పటికి వరండాలో నలుగురు యువతీమణులు నుంచుని వున్నారు. తల వంచుకొని మేము వెడుతోంటే,

"ఎందుకు వొచ్చారు?" అన్నారు.

తలెత్తి, "ఇంటర్‌వ్యూల కోసం" అన్నాను.

"ఇంటర్‌వ్యూలా? మేమిస్తాం. రండి. తీసుకోండి." అన్నారు.

వాళ్ళ రూపాన్ని చూసేటప్పటికి, చప్పున వాళ్లు అన్యకాంతలని స్ఫురణ వొచ్చి, కారుదగ్గరికి వెళ్ళిపోతున్నాము. వాళ్లు మా వెంట బడి,

"ఇంటర్‌వ్యూలు మాదగ్గిర వున్నాయి. తీసుకోండి, చాలా బావుంటాయి. మేమిస్తాం. మాకభ్యంతరం లేదు." అంటో కారు కదిలిందాకా అభ్యంతర పెట్టారు. మేము వినలేదు. వాళ్లు కంఠం మార్చి,

కన్నీళ్లతో, దీనంగా ప్రవరాఖ్యుడి గుండె కరిగేటట్టు రాల్గరగించు గంధర్వ స్వరాలతో—

'తీసుకోరా! మా ఇంటర్‌వ్యూలు తీసుకోరా!' అంటూ రాగరాగాల విలపించారు. మేము త్వరత్వరగా కారులో బైలుదేరుతో వుండగా, మమ్మల్ని అనేక కొత్తరకాల, రెండు మూడు భాషల్లో తిట్లూ, శాపనార్థాలూ—

"అవునులెండి. మా ఇంటర్‌వ్యూలు మీ కెందుకు? మీకల్లా ఆ ముసిలి...వీ, దొంగ...వీ, ఆ నక్కటక్కుల...వీ, ఆ జిడ్డుగొడ్డు ... ... వీ, ఇంటర్‌వ్యూలు కావాలి గాని!" అనే కేకలూ, మెటికలు విరవడాలూ, ఉమ్ములూ, మా తల్లుల్నీ, ఆ తాతల తాతల్నీ కలిపి తిట్లూ వినబడ్డాయి.

హోటలు చేరేటప్పటికి కారుకర్చు ఇరవై ఐదురూపాయ లయింది. ఇంక డబ్బులేదు. హోటలు బిల్లుకి సరిపోతుందో లేదో! అందులో ఆంధ్రప్రసిద్ధ పురుషుడి బొర్రని మేపడం సులభసాధ్యం కాదు, నా సన్నని పర్సుకి. అందుకని అర్ధరాత్రి లేచి, ఓ పంచా, షర్టూ తీసుకొని, కొత్తచోటుకి పలాయనమైనాను.

మర్నాటికి నాకు చిల్లర తారలే మిగిలారు. జేబులో కొంచెం చిల్లరడబ్బులే మిగిలాయి. మా వంశం పట్టిన పట్టు వొదలక పోవడానికి అతిప్రసిద్ధి కెక్కింది. మా తాత గేదె చచ్చినా యింకా పాలు పితుకుతూనే వున్నాట్ట. మా మామ జీవితమంతా వాళ్ళ బావిలోంచి పొట్లపాదుకు కాలవతీసి నీళ్లెక్కిం

చాలనే ప్రయత్నంలో గడిపాడు. నేను నా ప్రయత్నం వొదులుకొని, మా పెద్దలకి అప్రదిష్ట తెస్తానా!

బాగా విచారించి - అప్పుడే పూర్తికావొచ్చి ఎన్నటికీ పూర్తిగాని ఒక సంవత్సరాది ఛాలెంజి ఫిల్ము రాజములో అక్కడక్కడ నటించిన ఒక తార ఎడ్రస్ ఆరణాల ఖర్చుతో సంపాయించి, మూడణాల చార్జీతో, మూడు కాళ్ళ నడకతో చేరుకునేటప్పటికి మధ్యాన్నం రెండుగంట లయింది. గొప్ప హార్మ్యం కాదు. బైట యెవరూ లేరు. కుర్చీలూ లేవు. ఆమెతో ఇంటర్‌వ్యూ ఇట్లా వుంటుందనుకో లేదు. గంభీరమైన జవానూ, అతను నా వులిపిరి కార్డు తీసుకొని వెళ్ళ డమూ, ఆమె ఆహ్వానించడమూ, చిరునవ్వూ, నమ స్కారం—ఏమో! Shake hand కూడా నేమో!— కాఫీ, Tiffin, Goldflake సిగరెట్లూ, కిల్లీ, యింకా అదృష్టముంటే, నిజమైన Inter...view!

తలుపు కొట్టాను. నాలుగుసార్లు కొట్టిన తర వాత గుసగుసలు—

"ఎవరు?" అనే గంభీర పురుషనాదం.

"—వున్నారా అండి!"

తలుపు తెరుచుకొని, అడావిడిగా, చురచుర మంటో లుంగీకట్టుతో, క్రాపుతో పొట్టి మీసాలతో ఒకాయన వొచ్చాడు.

"ఏం పని?"

"......గారితో ఇంటర్‌వ్యూకి వొచ్చాను."

"ఎవరు నువ్వు?"

కార్డు మడతలు విప్పుతున్నాను.

"ఏ పత్రిక?"

"ఏ దన్నను!! ఒక టేమిటి! అన్నీనీ"

"వీల్లేదు. వెళ్ళండి."

వీడెవడు? ఈ వేషంలో ఆమే నేమో!

"తమరు ఆమె—"

"అవును, వెళ్ళండి."

అంటో, చాలా అవసరంగా తలుపు గడియ వేసుకున్నాడు. చాలా నిరాశపడ్డాను. ఏకీ...గతీ... నాకూ! కొందరు తారలు షూటింగులో వుంటారు. తక్కినవాళ్లు మీటింగులో ఉంటారు. స్త్రీ తారలు లాభం లేదు.

పురుష తారలో!

ప్రధాన తారదగ్గరికి అన్నిమైళ్ళూ నడిచిపోయి నాను.

"రా— వున్నారా?"

"ఇంటర్ వ్యూ కావాలా?...... కెమారా తెచ్చారా? లేదా?......వీల్లేదు వెళ్ళండి."

పక్కనే ఉన్నారని ఇంకోరి దగ్గరికి వెళ్ళాను. లోపల పెద్ద అరుపులు. కుర్చీలూ, బెంచీలూ విరుగుతున్నాయి.

"గ-వున్నారా? ఏం చేస్తున్నారు? రిహార్సలా! అదేం చప్పుడు?"

"దగ్గరగా మాట్లాడకండి. Bedroom లో ప్రణయసీను జరుగుతోంది...లోపలికి వెళ్ళకండి... దెబ్బలు తగులుతాయి."

మావో పురుష తార—

"నేను విడిగా సినిమా ప్రొడ్యూసరు కాబో తున్నాను. రెండు షేర్లు తీసుకోండి" అని వెంటపడ్డాడు.

పురుష తారలు లాభం లేదు.

ఇంక బాలతారలు మిగిలారు. అవును, ఆ పని అమ్మాయిల్ని ఇంతవరకూ యెవరూ బాధించినట్లు లేదు. బేబీసరోజ పట్నంలో లేదు. అవును! మన వాళ్ళ పిల్ల 'ఉషారాణి' ఉంది!

"అప్పుడే ఆంధ్రలో కానికి బాగా పరిచితురా లయింది." పాపం!

ఏమయితేనేం! నేను వ్రాసేది అందరూ చదువు తారు. అదిగాక—

'జిల్లా జడ్జీ చిన్నబాలికగా వుండికూడా... చాలా శ్లాఘించాడు కూడాను, యీమె డాన్సుని." అని ప్రకటించారు కూడాను.

మర్నాడు పొద్దున్నే తొమ్మిదింటికి యీ బాల తారగారియిల్లు చేరుకున్నాను. దోవలో అతి తెలివిగా, ఉన్న మూడు కానులూ పెట్టి సగంతో పిప్పరుమెంటు బిళ్ళలూ, సగానికి gem బిస్కట్లూ కొన్నాను. ఒక గిలక్కాయా, పూసలదండా, రెండు కాళీ సిజరు packets సేకరించి వుంచాను.

ఒకమ్మాయి చెట్టుకింద కుక్క చెవిలో జోరీగలు ఏరుతోంది. సానుభూతి చూపు పెట్టి పక్కన నుంచు న్నాను. ఈసారి abrupt ప్రశ్నలడిగి పని పాడు చేసుకో కూడదు. మా అమ్మమ్మగారి వేపు tact నంతా వుపయోగించాలి.

"నీ కుక్క బిస్కట్లు తింటుందా?"

నా చేతిలో ఒక బుడ్డబుంజాని పెట్టింది.

"తిను" అంది.

"ఎందుకు?"

"వొదిలేస్తే మళ్ళీ దీని చెవిలోకి ఎక్కి బాధి స్తుంది."

"నీ కుక్క పేరేమిటి?"

"జానకి."

"జానకి మా అమ్మపేరు!"

"నీ పేరేమిటి పాపా!"

"తార."

ఇంకేం! అప్పుడే తనని తనే తారకింద పిలుచు కుంటోంది! అందరు తారల్నీ మించిందే!

"నువ్వేనా తెలుగు సినిమా తార?"

"నువ్వే సినిమాతార. నన్ను వృథాగా తిడతా వేం, వెధవా!"

చెడుతోంది వ్యవహారం.

"అది కాదు పాపా!..."

"నే నేం పాపనికాదు. ప్రతి జోగీ 'పాపా, పాపా' అంటాడు. మా అన్నయ్య పీ. పీ. అన్నప్పు డల్లా తంతాను."

"నీ కీర్తిని విని నిన్ను చూడాలని చాలా దూరంనించి వొచ్చాను!"

"వొచ్చావా! అయితే జానకి కాళ్లు గట్టిగా పట్టుకో. కరిచినా వొదలకూడదు."

"నీకు ఎటువంటి చిత్రాల్లో—"

"ముందు కదలకుండా కాళ్ళు పట్టుకొని మాట్లాడు."

కుక్క వెనక కాళ్లు గట్టిగా పట్టుకొని—

"నీకు యెటువంటి చిత్రాల్లో నటించాలని వుంది?"

"నీ నెత్తి చిత్రాల్లో! కుక్కని కదలనీకు. తంతా, జాగర్త."

"పోనీలే. తెలుగు సినిమా తారల్లో మీ అమ్మగా ఎవరు వుండాలని వుంటుంది?"

"నన్నడుగుతావేం? నాకేం తెలుసు? మా నాన్నని అడుగు."

"మీ నాన్నగారి పేరేమిటి?"

"నాన్నగారి పేరా!...ఊ......దరిద్రుడా!"

ఏదో చెబుతోందని, కాయితమూ పెన్సలూ తియ్యాలని కుక్క కాళ్లు వొదిలాను. కుక్క ఎగిరింది. అమ్మాయి నా వీపుమీద గుద్ది తిట్టింది.

"తీసుకురా. పో. నా కుక్కని తీసుకురా."

"నేను నీకు మంచి బెంగుళూరు కుక్కపిల్లని తీసుకొచ్చిపెడతా. నాప్రశ్నలకి సమాధానం చెపుతావా?"

"సరేలే, నా కుక్కని తీసుకురా."

వొస్తుందిలే."

ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"కుక్కలవాళ్లు బండిలో వేసికెళ్ళి చంపుతారట. ఇంతమంది మనుషులు వుంటే, నా జానకే యెందుకు కావాలో, చంపటానికి వాళ్ళకి!"

బయటికి వెళ్ళి, నా బిస్కటు ముక్కల సహాయంతో జానకిని ఆహ్వానించుకొని వొచ్చాను. ఇద్దరం కలిసి జానకిని బంధించాము, స్తంభానికి. నా పిప్పరుమెంటుబిళ్ళలు ఆమెకి యిచ్చాను.

"ఎక్కడ యేరుకొచ్చావు, యీ బిళ్ళలు? గోడఅవతల పారెయ్యి. జానకి తింటే దానికి వికారపెడుతుంది."

"ప్రస్తుత అంతర్జాతీయక్లిష్టపరిస్థితుల ఫలితంగా ప్రపంచ ఫిలిం పరిశ్రమకి, ముఖ్యంగా దేశీయ ఫిలిం పరిశ్రమకి సంభవించిన శతసహస్రకష్టాల్ని తొలగించడానికి నువ్వు యేదైనా చిత్తుప్రణాళికగాని, నిర్మాణకార్యక్రమాన్నిగాని సూచించగలవా?"

"మళ్ళీ చదువు, ఆ పద్యం!"

"ఒక Co-operative limited కంపెనీ దేశీయపెట్టుబడిదార్లందరూ స్థాపించి, కేంద్రప్రభుత్వంవారి Subsidy తో raw film తయారుచేయడం మంచిదే అంటావా?"

"నోరుముయ్యి, జానకి జడుసుకుంటోంది."

"ఏమిటె, పుస్తకంలో గీస్తున్నావు, జానకి బొమ్మా?" అంది.

"నీకు యే డైరెక్టరు యిష్టం?"

"ఎవరూ యిష్టంలేదు. అందరూ..."

"కాంచనమాల యెట్లా నటిస్తుంది?"

"నటించదు-"

"మరి యేం చేస్తుంది?"

"కొడుతుంది-"

"నీకు అబ్బాయి వేషం ఇష్టమా, అమ్మాయి వేషం ఇష్టమా?"

"ముసలి వేషం యిష్టం-"

"నీకు పాట చాత నౌనా?"

"ఇంతసేపూ అడగలేదేం?"

అని పాడుతోంది, ఉత్సాహంగా—

'మానసంబున—విరోచనమాయె'

"చాలుగాని—"

"ఇంక జానకి చాత పాడించనా?"

"జానకి చాతా?"

"ఏం, సినిమాలో ఆ పాటలన్నీ డబ్బు ఖర్చుపెట్టి బాగానే వింటారే! ఆ పాటలకంటే తీసిపోయిందా జానకి పాట-"

"చిత్రాల్లో సంగీతం వుండాలా, వుండకూడదా?"

"ఉండాలి - చిత్రమంతా సంగీతమే ఉండాలి- ఆ సంభాషణకంటె అదే నయం-"

"ఆంధ్ర సినిమా బాలతారల తరఫున మీరు ప్రభుత్వం దగ్గరికి ఒక Deputation తీసుకెళ్ళరాదా?"

"ఎంత బరువుంటుంది?"

"ఏమిటి?"

"అదేదో అన్నావే, డిప్యూ - అదీ - సరే లేవ నెత్తుతాగాని, యేమిస్తావు నాకు?"

"నాకు డబ్బు లేదు-"

"లేదా, పాపం! రోజూ మా జానకిని షికారు తిప్పరాదూ? మా అమ్మ చూడకుండా, జానకి వొది లేసిన అన్నం పడేస్తాను నీకు-"

"నిన్ను కొందరు ఆంధ్ర షెర్లీ టెంపుల్ అంటు న్నారు. నీ అభిప్రాయం ఏమిటి?"

"ఎవరో గిట్టని వాళ్ళు అంటారు. నాముందు అనమను, తెలుస్తుంది."

"కాంచనమాలని గ్రేటాగార్బోకంటె గొప్పది అన్నారు. నీ అభిప్రాయం యేమిటి?"

"ఆ గార్బొ బాగా కీచుమని అరుస్తుందా? కళ్ళు తేలేసి గుండె బాదుకుంటుందా?"

"నేను గ్రేటా గార్బోని చూడలేదు."

"కాంచనమాలని చూశారా?"

"వెళ్లాను. చూడడానికి వీలులేకపోయింది. ఎవరో నవ్యసాహితీ కవివరేణ్యుడి దగ్గర పాటలు నేర్చుకుంటోందని, ఓ వెన్నడబ్బా పట్టుకుని వాకిట్లో కూచున్న బొద్దింక చెప్పాడు."

"అవును. వాళ్ళిద్దరూ మాయింటికే వస్తారు."

"ఎవరు?"

"ఆ కవీ, బొద్దింకా-వాళ్ళిద్దరికీ స్నేహం-"

"నీకు యేపాటలు యిష్టం?"

"మా పెదనాన్న పాటలు - ఇందాకా పాడిన పాట ఆయన చెప్పిందే-"

"నీకు యెన్ని పారితోషికాలు వొచ్చాయి, ఇంతవరకు?"

"మూడుసార్లు జ్వరం వొచ్చింది. ఈ మధ్య ఒక కురుపుకూడా లేచింది."

"నీకు యే తారలమీద చాలా యిష్టం?"

"కుక్కలమీద."

కారు ఆగింది. అది చూసి ఇంట్లోంచి యెవరో నవ్వుకుంటో వొస్తున్నారు.

"నీకోసమా, ఆ కారు?"

"నా కోసం యెవరు పంపుతారు? అన్ని కార్లూ అమ్మకోసమూ, ఉషకోసమూ."

"ఉష కోసమా?...ఉష యెవరు?"

"మా చెల్లెలు."

"నువ్వూ!"

"ఏం, నీకు బుద్ధిలేదూ? నేను తారని. ఉష అక్కయ్యగారిని."

"సినిమా తార యెవరు?"

"అదుగో ఆ మాట మళ్ళీ యెత్తుతున్నావు! ఇంక చాలుపో-మా యింట్లో యెవరూ తారలు లేరు, నేను తప్ప."

"మరి నువ్వు యెక్కడ నటించావు?"

"నీ మొహంమీద. నేను యెందుకు నటించాలి?"

"మరి యేం చేస్తావు?"

"అట్టే మాట్లాడితే, నిన్ను తంతాను."

లోపల్నించి పిల్లల్నూ, స్త్రీలూ, వొస్తున్నారు.

"... ... ఇది చెప్పు. ఉష యెవరు?"

ఉంగ్రాల జుట్టు, పెద్ద కళ్లు, చిన్న మూతి - ఓ అమ్మాయిని చూపింది.

"ఉషారాణీ!" అన్నాను, సమీపిస్తో!

"అమ్మా, ఇంకోడు వొచ్చాడు."

అని ఒకామె వెనకాలికి వెళ్ళింది. జానకి తాడు తెంపుకుని నా మీదికి దూకింది.

"జాగ్రత్త. జానకి పళ్లు చాలా నాజూకు. కాలు కదల్చకు." అంటోంది తార.

జానకి వెనకా, నేను ముందూ రోడ్డుమీద పడ్డాము.